క్లుప్తంగా

శ్రీ మఠంలో ప్రముఖులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక స్పీకర్ బసవరాజు, జౌళిశాఖ మంత్రి శంకర్ పాటిల్ బుధవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు శేష వస్త్రం, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వాదించారు. అనంతరం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఐ భాస్కర్, ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్ బందోబస్తు చేపట్టారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానిక 9వ అంగన్‌వాడీ సెంటర్ నూతన భవన నిర్మాణానికి సచివాలయం–3 పక్కనున్న స్థలంలో సర్పంచ్ పాల్‌దినకర్, పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి బుధవారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ నాడు–నేడు రెండో విడత కింద భవన నిర్మాణానికి రూ. 16లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య, ఉరుకుంద ట్రస్టు బోర్డు డైరెక్టర్ వెంకోబ, మాజీ ఉప సర్పంచ్ ఉమపతి, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీర గోవిందమ్మ, నాయకులు సమద్, వడ్డెరాము, పూజారిలింగ, సత్యప్పస్వామి పాల్గొన్నారు.

కనీస వేతనమివ్వాలి

ఆదోని రూరల్ : అంగన్‌వాడీ హెల్పర్లకు కనీస వేతనం ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకురాళ్లు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆదోని అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఆయాలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ పట్టణ సీనియర్ నాయకులు మహానందరెడ్డి, లక్ష్మన్న, యూనియన్ నాయకురాళ్లు (సీఐటీయూ) పద్మజ సరోజ, సాలమ్మ మాట్లాడుతూ సీనియారిటీ ప్రకారం హెల్పర్లుకు ప్రమోషన్లు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ఒకే ఈతలో నాలుగు మేక పిల్లలు



నేలకోసిగి గ్రామంలో ఒకే ఈతలో నాలుగు మేక పిల్లలు

కోసిగి: మండలంలోని నేలకోసిగి గ్రామంలో పూజారి అయ్యేలప్ప అనే రైతుకు చెందిన మేక ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. బుధవారం ఉదయం తన ఇంటి ఆవరణలో ఈనిందని, ఒకే ఈతలో నాలుగు పిల్లలు జన్మించడం చాలా అరుదని రైతు పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెద్దకడబూరు : ఉపాధీ హామీ పథకం కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని రైతుసంఘం నాయకులు తిక్కన్న, పరమేష్ కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం – 2 కెదుట బుధవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ వలసలను నివారించేందుకు పనిదినాలను 200, వేతనాన్ని రూ.600కు పెంచాలన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లును ఇవ్వడంతో పాటు మెడికల్ కిట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. కూలీలు పని ప్రదేశంలో చనిపోతే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు. దేవదాసు, రత్నం, శాంతరాజు, కిరణ్ పాల్గొన్నారు.

పట్టుబడిన కర్ణాటక మద్యం ధ్వంసం



డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని బుధవారం మండలంలోని నెట్టేకల్ క్రాస్ రోడ్డు వద్ద డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. డివిజన్ పరిధిలోని ఇస్వీ పోలీస్‌స్టేషన్, పెద్దతుంబళం, నందవరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పట్టుబడిన 2,800 కర్ణాటక 90 ఎం.ఎల్. ఓసీ టెట్రా ప్యాకెట్లను ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే గాకుండా పదేపదే పట్టుబడే వారిపై అదే వృత్తిగా మలుచుకుని చేస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఆదోని తాలూకా సీఐ మహేశ్వర్‌రెడ్డి, పెద్దతుంబళం ఎస్ఐ రమేష్ బాబు, నందవరం ఎస్ఐ మహేష్, ఇస్వీ హెడ్ కానిస్టేబుల్ బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు



మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నవరత్నాలు పథకాలను అమలు చేస్తూ మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 4వ వార్డు దండిగేరి, దత్తాత్రేయ ఆలయ ప్రాంతం, కారిబుడి వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకు తిరుగుతూ సమస్యలను, కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ వస్తుందా, అమ్మఒడి, ఆసరా పథకాలు అందుతున్నాయా లేదా అని వాకబు చేశారు. పథకాలు రాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వలంటీర్లు, సిబ్బంది పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ముందుగా కాలనీలోని దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆ ప్రాంతంలో నున్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకొని, దేశానికి, రాష్ట్రానికి, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం కాలనీల్లో పర్యటిస్తూ సంక్షేమ పథకాలను వివరించే బుక్‌లెట్ అందజేసి అందిన పథకాలు, చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ చేయలేనటువంటి అభివృద్ధి పనులను కేవలం మూడున్నరేళ్లలోనే సీఎం జగన్ చేసి చూపించారన్నారు. ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎవరు ఏం చేశారు.. ఎలా చేశారో వారికి అన్నీ తెలుసునని, మరోసారి వారిని ఇంటికే పరిమితమ చేస్తారని చెప్పారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు వారి విమర్శలు జగనన్నను ఏమీ చేయలేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, ఆయా రాష్ట్ర కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు రేణుక, మంజుల, అహ్మద్‌బాషా, మస్తాన్, సలీం, అబ్దుల్, ఉమామహేశ్వరి, మున్సిపల్, యార్డు వైస్ చైర్మన్‌లు నరసింహులు, కామాక్షి తిమ్మప్ప, నాయకులు తాయన్న, శ్రీలక్ష్మి, పర్వద్‌బాను, ఏజస్, మాలిక్, బి.టి.లక్ష్మన్న, గోవిందు, లాలుబాషా, రహీం, బాబు, హరికృష్ణ, భవానీ, సంజీవ్, యల్లప్ప, చలపతి, చిన్నా, శ్రీధర్, వేణు, కిషోర్, చాంద్‌బాషా, హరి, దానం, ఇక్బాల్ పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

ఆదోని అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి గ్రాడ్యుయేట్లు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే ఓటర్ల నమోదులో ఆదోని రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఆరువేల మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, వారందరూ రవీంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. ప్రభుత్వ సేవలను చూసి ఆయనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పాఠశాల హెచ్ఎంలు మల్లికార్జున, అలీంసిద్దిఖీ, ఉపాధ్యాయుడు రామయ్య, నాయకులు రామలింగయాదవ్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, చిత్రంలో సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి

ఆదోని అర్బన్: పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో భాగంగా విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక బాలికల పాఠశాలలో ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనపై వర్క్‌షాప్ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను మొదలుకొని ఎంఈఓ, డిప్యూటీ ఈఓ వరకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే డివిజన్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించగలమన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఫెయిలైతే వారు మళ్లీ చదవడం చాలా కష్టమవుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రతిఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. దేశానికి మంచి పౌరుడిని అందించే అవకాశం ఉపాధ్యాయులకే ఉందన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో బలహీనంగా ఉంటారో వాటిపై ప్రత్యేక తరగతులు చేపట్టి తీర్చిదిద్దాలని చెప్పారు. రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలు రానున్నాయని, ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టుల వారీగా గ్రూపులు ఏర్పాటు చేసి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్, డిప్యూటీ ఈఓ సుకుమార్, ఎంఈఓ శివరాముడు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరుకుందలో వేలం పాటలు



టెండర్ల బాక్స్‌ను తెరుస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో బుధవారం వివిధ పనులకు బహిరంగ వేలంతో పాటు ఆన్‌లైన్, షీల్డ్ టెండర్లను దేవదయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషు నాయుడు సమక్షంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో టెండర్లను నిర్వహించారు. బహిరంగ వేలానికి ఎవరూ రాకపోవడంతో ఆన్‌లైన్, షీల్డ్ టెండర్లు బాక్స్‌ను తెరిచి టెండర్లలో పాల్గొన్న వారి పేర్లను ప్రకటించారు. కార్యాలయానికి కావలసిన ప్రింటింగ్ పుస్తకాల కోసం ముగ్గురు టెండర్లు దాఖలు చేశారు. విద్యుత్ సామగ్రి సరఫరా కోసం ముగ్గురు టెండర్లు దాఖలు చేసినట్లు వాణి తెలిపారు. కలగలపు బియ్యం పోగు చేసుకునే హక్కు కోసం ఆన్‌లైన్‌లో ఇద్దరు టెండర్లు దాఖలు చేశారని చెప్పారు. కాగా టెండర్లకు ఇద్దరు,ముగ్గురు మాత్రమే వేయడంపై నివేదికను ఉన్నతాధికారులకు పంపి తుది జాబితాను ప్రకటిస్తామని ఆమె తెలిపారు. అలాగే సులభ్ కాంప్లెక్స్ టెండర్‌ను రద్దు చేశారు. దీంతో పాటు వంట చెరుకు సరఫరా చేయుటకు, సెల్ ఫోన్లు, లగేజీ భద్రపరచడానికి టెండరు, క్లాతింగ్ (వస్త్రాలు) మెటీరియల్స్ టెండరు, స్వామి వారికి పూలు, పూలదండలు సరఫరాకు వేసిన టెండర్లలో పాటదారుల నుంచి సరైన ధర లేకపోవడంతో వాటిని కూడా రద్దు చేసినట్లు వివరించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ప్రజలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : గ్రామాల్లోని ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు వేతనం పొందాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలో వలసల నివారణలో భాగంగా కపటి, నాగలాపురం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. వలసలు వెళ్లడానికి గల కారణాలను ప్రజలను అడిగి సబ్ కలెక్టర్ తెలుసుకున్నారు. వలసలు వెళ్లడం వల్ల ఎదురయ్యే సమస్యలను తెలియజేశారు. గ్రామాల్లో ఉన్న వనరులను ఉపయోగించుకుని జీవనోపాదులను మెరుగుపరుచుకునే అంశంపై గ్రామ ప్రజలతో చర్చించారు. గ్రామాలను వదిలి వలస వెళ్లకుండా ఉపాధి హామీ పథకం ఉపయోగించుకుని గ్రామాల్లో ఉంటూ లబ్ధి పొందాలని కోరారు. గ్రామ ప్రజలు అదనపు వేతనం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లోకేష్, ఎంపీడీఓ గీతావాణి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కె.నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వలసలు వెళ్లొద్దు..పనులు కల్పిస్తాం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య

మంత్రాలయం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పిస్తామని, ఎవరూ వలస వెళ్లొద్దని డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. బుధవారం మండలంలోని సూగూరు, చిలకలడోణ గ్రామాల్లో ఏపీఓ తిమ్మారెడ్డి నేతృత్వంలో గ్రామ సభలు నిర్వహించారు. వలసలు వెళ్లడానికి గల కారణాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డబ్బులు ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశంతోనే ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని స్థానికులు తెలిపారు. సూగూరులో మిరప పంట అధికంగా దిగుబడి రావడంతో ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది కూలీలు పనుల కోసం గ్రామానికి వస్తున్నారని చెప్పా. చిలకలడోణ గ్రామానికి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగు నీరు అందించాలని కోరారు. ఎంపీడీఓ ప్రభావతి, ఏపీఎం జయశ్రీ తదితరులు ఉన్నారు.

ఘనంగా పల్లకోత్సవం



ఊరేగుతున్న మఠ్రిస్వామి దంపతులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన కృష్ణావధూత స్వామి 48వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అర్లబండ మఠం మఠాధిపతులు మఠ్రిస్వామితాత, రత్నమ్మవ్వ దంపతుల పల్లకోత్సవం బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య పల్లకీ గ్రామోత్సవం పట్టణంలో మధ్యాహ్నం వరకు సాగింది. మహిళలు కలశాలతో తరలి వచ్చారు. యువకుల కోలాటలు, చిన్నారుల సాంస్కృత నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెల్లవారు జామున కృష్ణవధూత స్వామికి సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో ప్రతి రోజూ రాత్రి భగవద్గీత పఠనం గావించారు. ఈ సందర్భంగా వివాహం చేసుకున్న వధువుకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి తాళిబొట్టు, ముత్తు, మెట్టెలు అందజేశారు. సర్పంచ్ పాల్‌దినకర్, నిర్వహకుడు అయ్యప్ప, నాయకులు ఉప సర్పంచ్ తిక్కయ్య, వడ్డెరాము, ఉశేని పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం

నందవరం: ఆడపిల్లలను కాపాడుకుందామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో వారోత్సవాల్లో భాగంగా జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పీహెచ్‌సీలో విచారణ

హొళగుంద: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆదోని డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ సత్యవతి విచారణ చేపట్టారు. వైద్యులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ విచారణకు ఆదేశించడంతో ఆమె బుధవారం పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. రోగులు, ప్రజలను విచారించి వారి ఫిర్యాదులు తీసుకున్నారు. ఇద్దరు డాక్టర్లను నియమించినా ఒకరు మాత్రమే విధులకు హాజరవుతున్నట్లు గుర్తించారు. మరో డాక్టర్ నెల రోజులుగా గైర్హాజరైనట్లు తెలుసుకున్నారు. డాక్టరు, ఫార్మాసిస్ట్ మధ్య ఉన్న గొడవలు, ఇతర సమస్యలపై ఆరా తీశామని, నివేదికను సబ్ కలెక్టర్‌తో పాటు డీఎం అండ్ హెచ్ఓకు పంపిస్తామని ఆమె విలేకరులకు తెలిపారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న మునిస్వామి

ఆదోని అర్బన్ : అక్కినేని, తొక్కినేని అంటూ చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆదోని పట్టణ అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు మునిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్వీ రంగారావు, అక్కినేని తొక్కినేని అంటూ కళామతల్లి ముద్దుబిడ్డలను అగౌరవపరచడం, అహంకారంగా మాట్లాడటాన్ని ఖండించారు. మీ నాన్నకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ఏమీ అనలేని మీరు.. వారిని అవమాన పరిచేలా మాట్లాడటం దారుణమన్నారు. ఇప్పటికైనా అభిమానులకు, వారి కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెప్పాలని సూచించారు.

కర్ణాటక ప్రభుత్వం దృష్టికి గడినాడు కన్నడిగుల సమస్యలు

● బెంగళూరులో సమావేశానికి హాజరు



బెంగళూరులో సమావేశంలో పాల్గొన్న గడినాడు కన్నడిగులు

హొళగుంద: ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో ఉంటున్న గడినాడు కన్నడిగుల సమస్యలపై బుధవారం బెంగళూరులో జరిగిన సమావేశంలో చర్చించారు. హొళగుంద, ఆదోని, హాలహర్వి, పెద్ద హరివాణం, కౌతాళం తదితర మండలాల కన్నడ సంఘం నాయకులు దొడ్డ బసప్ప, గురుబసవరాజు, జంబునాథ్ తదితరులు సమావేశానికి హాజరై ముఖ్య అధికారి సోమశేఖర్‌కు ఈ ప్రాంత కన్నడిగుల సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేశారు. 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిపోయి ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఏపీలోని సరిహద్దు గ్రామాల్లో ఉంటున్న కన్నడిగులను గడినాడు కన్నడిగులుగా గుర్తించాలని కోరారు. కన్నడ విద్యార్థులు అధికంగా ఉన్నారని, వారికి ఉద్యోగాల పరంగా కర్ణాటక, ఏపీ రాష్ట్రాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. గడి నాడు కన్నడిగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరినట్లు సంఘం నాయకులు తెలిపారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్ : సంక్షేమ హాస్టళ్లను సబ్ కలెక్టర్ తనిఖీలు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో విలేరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పురుగుల అన్నం, నీళ్లచారు పెడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అలాగే హాస్టళ్లలో మెనూ కూడా పాటించడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న, సక్రమంగా విధులకు హాజరు కాని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ గురుకుల, కస్తూర్బా విద్యాలయ హాస్టళ్లో నాణ్యమైన భోజనం అందించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.నాయకులు నాగార్జున, గణేష్, గౌస్, పవన్, సమీర్, నాగరాజు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధంలాంటిది



ఆర్ట్స్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు,



మంత్రాలయంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఇది వజ్రాయుధం లాంటిదని, సద్వినియోగం చేసుకోవాలని ఆదోని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ వలి బాషా సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు రమాదేవి, లక్ష్మి, ఆర్ఐ జయరామిరెడ్డి, ఆయా పార్టీల నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ఈరన్న, రాముడు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్ : ఓటు హక్కు అనేది వజ్రాయుధమని, ఓటు వేసే వారు తమ అభివృద్ధికి దోహదపడే నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందని అక్షయ అర్బన్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డివిజన్ నాయకుడు అశోక్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు విరుపాక్షిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్, సొసైటీ సభ్యులు నాగరాజ్, యువరాజ్, వీరేష్, సురేష్ పాల్గొన్నారు.

కోసిగి: ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ రుద్రగౌడ పేర్కొన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఆర్వోలు, గ్రామ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, బాలుర, బాలికల పాఠశాల నుంచి విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మాణిక్యరాజు, ఆర్ఐ తిక్కస్వామి, హెచ్ఎంలు కృష్ణమూర్తి, నీలకంఠ, పీడీ రాజారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రాఘవేంద్ర సర్కిల్, మెయిన్‌గేట్ మీదుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల డీటీ శశిశేఖర్, అడ్వకేట్ రాఘన్నశెట్టి ఉన్నారు.

పెద్దకడబూరులో..

పెద్దకడబూరు : ఓటును నమ్ముకోవాలని, అమ్ముకోవద్దని తహసీల్దారు వీరేంద్రగౌడ్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ ఆర్.రామలింగారెడ్డి, పెద్ద నాగన్నను సన్మానించారు. ఆర్ఐ మహేష్, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దకడబూరులో సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించిన దృశ్యం

ముమ్మరంగా వంతెన నిర్మాణ పనులు



వంతెనపై కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

నందవరం: ఆంధ్ర – తెలంగాణ సరిహద్దులను కలుపుతూ నిర్మిస్తున్న వంతెనపై ఫ్లోరింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2009 వరద ధాటికి నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి కూలిపోయిన విషయం విధితమే. తెలంగాణ–ఆంధ్ర సరిహద్దులను కలుపుతూ బంధాలకు వారధిగా వంతెన నిలిచింది. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో దశాబ్దానికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడంతో వంతెన నిర్మాణం పూర్తి చేయిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించక వంతెన నిర్మాణ పనులను పెండింగ్ పెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పెండింగ్ బిల్లులు సైతం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో వంతెనపై రోడ్డు నిర్మాణంలో కాంక్రీట్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఫిబ్రవరి చివరి నాటికి నిర్మాణం పూర్తవుతుందని ఏజెన్సీ కిరణ్, సూపర్‌వైజర్ నాగుర్‌బాబు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కౌతాళం పింజారి గేరి పాఠశాల వద్ద పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో పారిశుధ్య పనులను ముమ్మరం చేసినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. బుధవారం పింజారిగేరి ప్రాథమిక పాఠశాల వద్ద పేరుకుని పోయిన చెత్తచెదారంను సిబ్బంది ద్వారా తొలగించారు. గ్రామంలోని అన్ని వీదుల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఇంట్లోని చెత్తచెదారంను బయట వేయకుండా ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. వార్డు మెంబర్ ఖాసీం, ఆశా వర్కర్లు ఉన్నారు.